'ఆటా' కథల పోటీల్లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

-యస్. ఘటికాచలరావు



# వెన్నెల సాక్షిగా!

**అనాలోచితంగా సహ ప్రయాణీకురాలి వైపు దృష్టి సారించాడు మదన్. ఒక్కసారి, ఒకే ఒక్కసారి మనస్సులో ఏదో తెలియని అలజడి చెలరేగి అంతలోనే సమసిపోయింది. అదే సమయంలో ఆమె కూడా మదన్ వైపు చూసింది. కళ్ళతోనే పలకరించి, పెదవులు విరిసీ విరియని ఒక చిరునవ్వు నవ్వింది. అసంకల్పిత ప్రతీకార చర్యలా ఆమె భావాలకు బదులిచ్చాడు మదన్.**

ఆఫీసు పనిమీద అనుకోకుండా అవసరంగా మదన్ హైదరాబాదుకు వెళ్ళవలసి వచ్చింది. ఎంతగా వాయిదా వేద్దామనుకున్నా వీలుపడలేదు. ఆఘమేఘాల మీద టికెట్ బుక్కింగ్ కూడా ఐపోయింది. మొదటి తరగతి ఎ.సి. మరో రెండురోజుల తరువాత ప్రయాణం.

అతని సీట్ కూపేలో ఉంది. అందులో రెండే బెర్తులు ఉంటాయి. రావలసిన మరో వ్యక్తి ఇంకా రాలేదు. బండి నెల్లూరులో ఎక్కువసేపు ఆగదు. రెండే నిముషాలు ఆగుతుంది. సరిగ్గా బయలుదేరే సమయానికి రావలసిన వ్యక్తి వచ్చారు.

వచ్చిన వ్యక్తి ఒక స్త్రీ. స్త్రీ అనకూడదు. ఒక యువతి అనాలి. వయసు ఖచ్చితంగా పాతిక సంవత్సరాలకు మించి ఉండదు. దేవకన్య కాకున్నా దేవకన్యకు దగ్గర బంధువని చెప్పవచ్చు.

మదన్ పేరుకు మదనుడేకాని ఈ విషయంలో అతను నిస్సందేహంగా త్రేతాయుగంలో అయోధ్యను పాలించిన శ్రీరామచంద్రుడు. తన భార్యను తప్ప మరొకరిని ఆ దృష్టితో చూడలేదంటే అతిశయోక్తికాదు. కాలేజి రోజుల్లో కాస్త కలివిడిగా వున్న మాట నిజమే. అది యువతకు సహజం. అందునా మదన్‌లాంటి మన్మధుడికి. చదువు తరువాత ఉద్యోగం మనిషికి గౌరవాన్ని, అంతస్తును ఇస్తుంది. పెళ్లయిన తరువాత ఆ గౌరవానికి బాధ్యత తోడౌతుంది. నిజమైన మనిషికి అతని వ్యక్తిత్వం వికసిస్తుంది. మదన్ వ్యక్తిత్వం అలాంటిదే. భార్య అనాకారి ఐతే పారుగింటి పుల్లకూర సామెత నిజం. నీరజ అందం సామాన్యమైనదేమీకాదు. ఆమె మీదనుండి దృష్టి మరల్చడం అసాధ్యమే.

"అలినీలాలక పూర్ణ చంద్రముఖి నేణాక్షిన్ ప్రవాళాధరన్
కలకంఠిన్ నవ పల్లవాంఘ్రి యుగళన్ గందేభ కుంభస్థనిన్..."

అంటూ రుక్మిణీదేవిని వర్ణించిన వర్ణన నీరజకు నూటికి నూరుపాళ్ళు సరిపోతుంది. ఆమెనుంచి దృష్టి మరల్చుకోలేక తెరచి ఉంచిన డ్రైనేజ్ గోతుల్లో పడ్డవాళ్ళు కాలేజి చదివే రోజుల్లో పాతిక మందికి పైనే ఉంటారని నీరజే స్వయంగానూ కాస్త గర్వంగానూ తనతో చెప్పింది తమ పెళ్లయిన కొత్తల్లో.

వివాహం తరువాత తనవైపునుంచి కూడా ఆమె మదన్‌కు ఏనాడూ ఏ విషయంలోనూ ఏ లోటూ రానివ్వలేదు. అలాంటప్పుడు పరస్త్రీ వ్యామోహం లేకపోవడం అతిశయోక్తికాదు.

అనాలోచితంగా సహ ప్రయాణీకురాలి వైపు దృష్టి సారించాడు మదన్. ఒక్కసారి, ఒకే ఒక్కసారి మనస్సులో ఏదో తెలియని అలజడి చెలరేగి అంతలోనే సమసిపోయింది. అదే సమయంలో ఆమెకూడా మదన్ వైపు చూసింది. కళ్ళతోనే పలకరించి, పెదవులు విరిసీ విరియని ఒక చిరునవ్వు నవ్వింది. అసంకల్పిత ప్రతీకార చర్యలా ఆమె భావాలకు బదులిచ్చాడు మదన్. మదిలో చెలరేగిన అలజడి సమసిపోయిన తరువాత ఆమెను నిశితంగా పరిశీలించాడు మదన్.

టి.టి.ఇ వచ్చి టికెట్లు తనిఖీ చేసి వెళ్ళిపోయాడు. మదన్‌ది పై బెర్తు, ఆమెది కింది బెర్తు. ఆమె పేరు భైరవి అని వయసు ఇరవైనాలుగనీ ఆమె ప్రయాణం కూడా హైదరాబాదుకేననీ టి.టి.ఇ చార్టు ద్వారా మదన్ గ్రహించాడు.

అందంలో నీరజకు సాటి కాకపోయినా ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది. అకస్మాత్తుగా తను చదివిన కొన్ని కథలు జ్ఞాపకానికి వచ్చాయి మదన్‌కు. రైలు బోగీల్లో ఈవిధమైన ఒంటరి, జంట ప్రయాణాలు, వాళ్ళ అనుభవాలు, కొన్ని తియ్యనివి, మరికొన్ని చేదువి అన్నీ గుర్తుకు వచ్చాయి మదన్‌కు. ఈ అమ్మాయిని చూస్తే చేదు అనుభవం మిగిల్చేదిలా అనిపించలేదు. 'ఎన్నడూ లేనిది ఏమిటీనాడు ఆలోచనలిలా పెడదారి పడుతున్నాయి' అనుకున్నాడు మదన్.

అప్పుడు సమయం రాత్రి సుమారు పది గంటలు కావస్తోంది. మదన్ తన బెర్తుమీదికి వెళ్ళి నిద్రకుపక్రమించాడు.

భైరవి ఏదో పుస్తకం చదువుతూ కూర్చుని ఉంది. బాగా కలవారి అమ్మాయిలాగుంది. లేకుంటే ఫస్ట్‌క్లాస్ ఏ.సిలో ప్రయాణం అంటే మాటలా! లేదా ఈమె తనకుమల్లే బ్యాంకు ఆఫీసరా? ఖరీదైన నగలు గానీ మితిమీరిన అలంకరణ గానీ లేకుండా చాలా సామాన్యంగా ఉందా అమ్మాయి. అలా ఆలోచిస్తూ ఎప్పుడో నిద్రలోకి జారుకున్నాడు.

అర్ధరాత్రి ఎప్పుడో చిన్న కుదుపుతో రైలు ఆగినప్పుడు. మేల్కొన్న మదన్ యథాలాపంగా క్రింది బెర్తు వైపు చూశాడు.

భైరవి గాఢ నిద్రలో అస్తవ్యస్తంగా పడుకుని ఉంది. చేతిలోని పుస్తకం పొత్తి కడుపుమీద ఉంది. పైట పిన్ను వేసుకోలేదు గాబోలు. పైట పూర్తిగా స్థానభ్రంశం చెంది ఉంది. లోనెక్ జాకెట్ ఆమె అందాలను కొంతవరకే దాచగలిగింది. ఉచ్ఛ్వాస నిశ్వాసలు అందాలకు ఊపిరి పోస్తున్నాయి. ఒక్క క్షణం వివశుడైపోయాడు మదన్. ఎంతటి నిష్ఠాగరిష్ఠునికైనా ఆ పరిస్థితులలో నిగ్రహం సడలక మానదు. అందులోనూ అది కూపే. ప్రపంచంలోని ఏకాంతమంతా ఒకేచోట పోగేసినట్టుగా ఉంది వాతావరణం.

ఐతే మదన్ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. అతని మనసులో ఏదో బెరుకు, భయం. ఈ అనుభవం తీపి అనుభవమా, చేదు అనుభవమా? అలా ఆలోచిస్తూ గట్టిగా రెండు కళ్ళూమూసుకుని బోర్లా పడుకున్నాడు. అలా పడుకుని తనకు తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాడు.

తిరిగి మెలకువ వచ్చేసరికి బండి ఆగి ఉంది. కింది బెర్తు ఖాళీగా ఉంది. భైరవి వెళ్ళిపోయినట్లుంది. ప్లాట్‌ఫారం మీద గోలగోలగా ఉంది. చాయ్ వాలాలు గోలగా అరుస్తున్నారు. ఒక్కసారి జరిగినదంతా కళ్ళ ముందు కదిలింది. చిన్నగా నవ్వుకుని రైలు దిగాడు. తన నిగ్రహశక్తికి తనకు తానుగా జోహారులర్పించుకుని హుషారుగా ఈలవేసుకుంటూ స్టేషను బయటకు నడిచాడు. అతని సమస్యకు సమాధానం లభించినట్లయింది. తన ఈ రైలు ప్రయాణపు అనుభవానికి, జరగని విషయాలు కల్పించి తియ్యని అనుభవం మిగిల్చేలా కథ అల్లి దానికి అక్షర రూపం ప్రసాదించాలని నిర్ణయించుకుని తన ఆలోచనలకు వెంటనే శ్రీకారం చుట్టాడు. తిరుగు ప్రయాణంలో రైల్లోనే తన కథను పూర్తిచేశాడు మదన్.

★ ★ ★

ఆరోజు పున్నమి వెన్నెల రాత్రి. చంద్రుడు చాలా చిలిపిగా ఉన్నాడు ఆరు గంటలకే.

"నీరజా! ఈరోజు రాత్రంతా వెన్నెల్లోనే గడపాలి. రాత్రి ఏడు గంటలకు వెన్నెల కాఫీ, తొమ్మిది గంటలకు వెన్నెల భోజనం, పది గంటలకు ... ఊ... ఊ..." అంటూ మదన్ సైగ చేశాడు.

"ఏమిటో అంత హుషారు"

"చంద్రకుమార్ గొడవ చేస్తున్నాడు"

"అతనెవడు?"

"అదుగో! ఆకాశంలో..."

ఫక్కున నవ్వింది నీరజ.

పెరట్లో పందిరి మంచం వేసింది. రెండు కుర్చీలు వేసింది.

"ఇదుగో వెన్నెల కాఫీ."

"వెరీ గుడ్! ఒక ఘట్టం ముగిసింది. తరువాతి ఘట్టం భోజనం. ఎంతకీ టైం గడవదేం?"

"మరీ బాగుంది. ఎందుకో అంత తొందర."

"నిజంగా చెప్పు. నీకు అలా అనిపించడం లేదా?"

"అవుననుకో...డీ..."అంటూ సాగదీసింది నీరజ.

వెన్నెల భోజనం కొసరి కొసరి ఒకరికొకరు గోరుముద్దలు తినిపించుకున్నారు. దానికితోడుగా మధ్యమధ్యన నంజుకోడానికన్నట్టుగా కొన్ని నోరు ముద్దులు.

"అకస్మాత్తుగా ఏమిటింత రొమాంటిక్‌గా తయారయ్యారీవేళ"

"చెప్పానుగదోయ్. అదంతా మిష్టర్ చంద్రా మహిమ"

"అది సరే నేనొక విషయం అడుగుతాను జవాబు చెప్తారా?"

"మూడ్ ఔట్ చెయ్యకుండా ఏమైనా అడుగు."

"నేనడగబోయేది మీ మూడ్ గురించే. రెండురోజుల క్రితం చాలా డల్‌గా పరధ్యానంగా ఉన్నారు. ఇప్పుడందుకు పూర్తిగా వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నారు. అది ఎందుకో కాస్త అర్థమయ్యేట్టు చెబుతారా."

"ఏమీ లేదు. కథల పోటీలో పాల్గొనాలనుకున్నాను. కథావస్తువు 'శృంగారం.' రచనల్లో శృంగార రసం ఎలా ఒలికించాలో నాకంతగా అవగాహన లేదు. అందువల్ల ఆ ఆలోచనలతో పరధ్యానంగా ఉన్నానంతే."



వాళ్ళిద్దరూ ప్రయాణిస్తున్న బస్సు శృంగార సామ్రాజ్యపు పొలిమేరల్లో ఆగిపోయింది. అతని బాహుబంధాల నుండి బలవంతంగా విడివడి అతని వైపు ప్రశ్నార్థకంగా చూసింది నీరజ. కాస్సేపు ఇద్దరూ తీక్షణ వీక్షణాలతో మౌన పోరాటం సాగించారు.

"ఓస్ ఇంతేనా! ఈ విషయం నాకు ముందుగా చెప్పి ఉంటే నేను కూడా కాస్త ఆలోచించేదాన్నిగా."

"ఏమో! అసలు నీకు చెప్పాలంటేనే నాకు సిగ్గనిపించింది. అందువల్ల చెప్పలేదు."

"అయ్యో పాపం. ఎంత సిగ్గో! సరసమంటే అసలేమీ తెలియదు కదూ!"

"అదేం కాదు. నిజ జీవితం వేరు. ఆ అనుభవాలను మాటల్లో రాయడం అంత తేలిక కాదు. అదీగాక నాకు ఈ తరహా కథలు రాయడమంటే సిగ్గనిపిస్తుంది."

"ఇందులో సిగ్గుపడాల్సిందేముంది. గత మూడేళ్ళుగా మనం చూడని శృంగార సామ్రాజ్యమా, మన అనుభవాలే కోకొల్లలు...రాస్తే."

"నా మొహంలా ఉంది నీ సలహా. అదేమీ అక్కర్లేదు గానీ మొన్నటి ప్రయాణంలో నాకు ఎదురైన అనుభవాన్ని కథగా రాశా..." అంటూ నాలిక్కరుచుకున్నాడు మదన్.

అంతే!

వాళ్ళిద్దరూ ప్రయాణిస్తున్న బస్సు శృంగార సామ్రాజ్యపు పొలిమేరల్లో ఆగిపోయింది. అతని బాహుబంధాల నుండి బలవంతంగా విడివడి అతని వైపు ప్రశ్నార్థకంగా చూసింది నీరజ. కాస్సేపు ఇద్దరూ తీక్షణ వీక్షణాలతో మౌన పోరాటం సాగించారు.

'ఏమిటి సంగతి?' అన్నట్టు ఆమె చూడగా, 'పాప ఏడ్చింది'అని బదులిచ్చినట్టు వేళాకోళంగా చూశాడతను.

"ఏమిటా అనుభవం?" ఐదు నిమిషాల మౌనం తరువాత అడిగింది నీరజ.

"అనుభవమా? అబ్బే! ఏమీ లేదు" అన్నాడు నిజాయితీగా

"లేదు. మీరేదో దాస్తున్నారు."

"నిజ్జంగా! ఏమీలేదు" నిన్నెలా నమ్మించాలో నాకు తెలియదన్నట్టుగా చూశాడు.

"ఏదో విషయం లేకుండా మీరు నోరు జారరు. ఇటువంటి విషయాలలో మీరు శ్రీరామచంద్రుణ్ణి మించినవారని నాకు తెలుసుగానీ, నిర్భయంగా చెప్పండి."

"థాంక్స్ నీరజా! నీ నమ్మకాన్ని వమ్ము చేయలేదు" అంటూ పూస గుచ్చినట్లుగా రైల్లో జరిగినదంతా వివరించాడు మదన్.

మెరిసే కళ్ళతో ప్రశంసాపూర్వకంగా చూసిందతని వైపు నీరజ. ఆ మరుక్షణమే "ఓస్. ఇంతేనా. ఈ మాత్రం దానికే ఏదో ఐపోయినట్లు ఫీలై పోతారెందుకు?" అంది బింకంగా.

"సహజసిద్ధమైన టెన్షన్, ఏదో భయం ఆవహిస్తుంది అలాంటి సమయాలలో" అన్నాడు మదన్ నీరజ ముఖ కవళికలు గమనించకుండా.

"అది మీ స్వభావానికి నిదర్శనం"

"అలాఅని కాదు. శీలం అనే పదం అందరికీ వర్తిస్తుంది. ఆడామగా తేడా ఏమీ లేదు."

"ఔననుకోండి... అంత అందంగా ఉందా ఆ అమ్మాయి?" అన్నది టాపిక్ మారుస్తున్నట్లుగా.

"మ్..." చిన్నగా నిట్టూర్చాడు అలసిపోయినట్లుగా

"నా కన్నానా?" స్త్రీ యొక్క సహజ సిద్ధమైన కుతూహలం పలికింది ఆమె గొంతులో.

"ఏమో!...నో కంపారిజన్" అన్నాడు ఎక్కడో చూస్తూ.

"అంటే...?"అంది నీరజ చిరు కోపంగా

"ఔను... నో కంపారిజన్."

"నో కంపారిజన్ అంటే పోలికే లేదు అని అర్థం. ఇద్దరిలో ఎవరో ఒకరు అనాకారి అయి ఉండాలి. అంతే కదూ" అన్నది బుంగమూతి పెడుతూ.

"అబ్బ అది కాదు లేవోయ్. ఆమెను చూసి చాలా తక్కువమంది డ్రైనేజీలో పడి ఉంటారు. అదన్న మాట."

పకపక నవ్వింది నీరజ.

"అదుగో అలా నవ్వకు. నేను నిగ్రహించుకోలేను."

"మిమ్మల్ని నేను నిగ్రహించుకోమనలేదే. నా చీర రంగు చూసైనా తెలియలేదూ" అన్నది నీరజ రెచ్చగొడుతున్నట్లుగా.

చిలకాకుపచ్చ రంగు చీర ఆమెది. అంటే ప్రేమకు పచ్చజెండా! అలసట లేకపోయినా, అతనివైపు చూస్తూ కవ్వింపుగా ఒళ్ళు విరుచుకుంది నీరజ... అర్థమైందతనికి!

ఆ మరుక్షణం!...

రెండు సర్పాల్లాగా పెనవేసుకున్నారిద్దరూ. శరత్కాల పౌర్ణమి రాత్రి!...

వెన్నెల సాక్షిగా!...

ప్రేమ సామ్రాజ్య స్థాపన...

(మిగతా 12వ పేజీలో)

*(9వ పేజీ తరువాయి)*

అనుభూతుల ఆకాశ హర్మ్యాల నిర్మాణం,,,!

అన్నీ చేతలే. అక్కడ ఇక మాటలకు అవకాశం లేదు. వారి జీవితంలో అలాంటి వెన్నెల రాత్రులెన్నో!

* * *

మరునాడు ఉదయం ఆఫీసుకు వెళ్ళేముందు మదన్ తను రాసిన కథను నీరజకు ఇచ్చాడు.

"ఎలా ఉందో చూడు. ఓకే అంటే పంపుదాం"అన్నాడు.

"రాత్రే ఇచ్చి ఉంటే చదివేదాన్నిగా."

"నువ్వు ఇవ్వనిస్తేగా. అందుకు సాక్ష్యం... వెన్నెల..." అని చిలిపిగా ఆమె బుగ్గమీద చిటికె వేసి ఆఫీసుకు బయలుదేరాడు మదన్.

సాయంత్రం అతను వచ్చే సమయానికి చదివేసింది నీరజ. అందులోని సందర్భాలు ఎందుకో అసహజంగా, అనుచితంగా అనిపించాయి ఆమెకు. అదే అభిప్రాయాన్ని ఆమె మదన్‌తో చెప్పింది. అతను సాలోచనగా ఆమె వైపు చూశాడు.

"నా అభిప్రాయం చెప్పి మీ వారం రోజుల శ్రమ వృధా చేశాను కదూ!" అంది నీరజ నొచ్చుకుంటున్నట్లుగా.

మదన్ తల అడ్డంగా ఊపాడు.

ఆరోజే... ఆ క్షణమే మరో కథకు శ్రీకారం చుట్టాడు మదన్. పాత కథ చె.బు. అనగా చెత్త బుట్టను ఆశ్రయించింది. గడువు మరొక పది రోజులు మాత్రమే ఉంది.

ఇప్పుడతనికి చాలా నమ్మకంగా ఉంది. ఈ కథ కచ్చితంగా వేలల్లో ఒకటిగా ఉంటుంది. అద్భుతమైన కావ్యంగా మిగిలిపోతుంది. మూడు రోజుల తదేక దీక్షతో కథను పూర్తిచేశాడు మదన్. కథ, కథనం, సంఘటన, సందర్భం, శైలి అన్నీ అత్యుత్తమంగా అమరి, అద్భుతమైన కథ ఆవిర్భవించింది.

"నీరజా! నా ప్రథమ పాఠక మహాశయా! అందుకో ఈ కథ నీకే అంకితం"

"వద్దు, వద్దు. నేను చదవడం, నచ్చకపోవడం..." అర్థోక్తిగా ఆపింది నీరజ.

"ఖచ్చితంగా అలాంటిదేమీ జరగదు. ఎందుకంటే నీ ఆలోచనల మేరకే రాశాను."

నీరజకు ఆసక్తి కలిగింది. అప్పటికప్పుడే చదవడం ప్రారంభించింది.

ఒక దశలో ఆమెకు వేడి నిట్టూర్పులు మొదలయ్యాయి. శరీరమంతా ఏదో విద్యుత్తు ప్రవహించినట్టయింది. సిగ్గుతో ముడుచుకుపోయింది. కనులు అరమోడ్పులయ్యాయి. మదన్‌కేసి చూడలేకపోతోంది సూటిగా.

**ఇప్పుడతనికి చాలా నమ్మకంగా ఉంది. ఈ కథ కచ్చితంగా వేలల్లో ఒకటిగా ఉంటుంది. అద్భుతమైన కావ్యంగా మిగిలిపోతుంది. మూడు రోజుల తదేక దీక్షతో కథను పూర్తిచేశాడు మదన్. కథ, కథనం, సంఘటన, సందర్భం, శైలి అన్నీ అత్యుత్తమంగా అమరి, అద్భుతమైన కథ ఆవిర్భవించింది.**

తమ వైవాహిక జీవితంలోని ఓ అపురూపమైన ఘటన అక్షర రూపంలో ప్రత్యక్షమైంది మదన్ కలం ద్వారా. ఓ వెన్నెల రాత్రి కళ్ళముందు నిలిచింది.

కథ చదవడం ముగించాక అరగంట దాటినా, తన్మయత్వంలో మరో లోకంలో విహరించ సాగింది నీరజ. ఆమెను పట్టి కుదిపి ఈ లోకంలోకి తెచ్చాడు మదన్.

ఆమె వెంటనే అతని చేతుల్లో ముఖం దాచుకుంది.

కొద్ది నిముషాలు మౌనంగా మధురంగా గడిచాయి.

హఠాత్తుగా నీరజ తల ఎత్తి మదన్ కళ్ళల్లోకి సూటిగా చూసింది.

మదన్ చిలిపిగా కనుబొమలు ఎగరేశాడు. 'ఎలా ఉంది కథ?' అన్నట్టుగా.

"ఈ కథకు బహుమతి ఎంతండీ?" అని అడిగింది.

"పదివేలు!" బహుమతి గ్యారంటీయా అన్నట్టుగా చూశాడు.

కాస్సేపాగి మెల్లగా అంది నీరజ.

"మన శృంగార సామ్రాజ్యాన్ని పదివేల రూపాయలకు అమ్మేస్తారా?"

వెయ్యి వోల్టుల విద్యుద్ఘాతం తగిలిన వాడిలా అదిరిపోయాడు మదన్. కొద్ది నిముషాలు మౌనం రాజ్యమేలింది.

"మీలోని రచయితను నిరాశపరుస్తున్నందుకు మన్నించండి."

మదన్ ఇంకా తేరుకోలేదు.

"తప్పు నాదే. నేను ఆ సలహా ఇచ్చి ఉండాల్సింది కాదు. అలా ఆలోచించి ఉండాల్సింది కాదు."

మదన్ అధోవదనుడై కూర్చుని ఉన్నాడు చేష్టలుడిగి.

"ఏమండీ! ఈ ప్రపంచంలోని కోట్లాది జనావళిలో ప్రతి జంటకూ కొన్ని మధురమైన అనుభూతులు ఉంటాయి. ఆ అనుభూతులు ఎంతో విశిష్టమైనవి. ప్రతి జంటదీ ఒక శృంగార సామ్రాజ్యం. అది ప్రపంచ పటంలో కనబడదు. ఆ రాజ్యంలో ప్రజలిద్దరే. మూడో వ్యక్తికి ఆ రాజ్యంలోని విషయాలు తెలియరాదు. కథ రూపంలో పేర్లు మార్చి రాసినా, ఎంత కాదనుకున్నా, ఎందుకో మన ప్రైవేట్ లైఫ్‌లోకి వేరే ఎవరో తొంగి చూస్తున్న అనుభూతిని కలిగించారు మీరు. అది మీ రచనా చాతుర్యమా లేక మన జీవితంలోని మధుర క్షణాల పట్ల నాకున్న గౌరవమా తెలియడంలేదు. అనుభవాల కడలినుండి కథలు వస్తాయన్నది ఎంతో వాస్తవం. ఐతే ఇటువంటి అనుభవాలు, అనుభూతులు కలకాలం మన మనసుల్లో నిండి, మనం కోరుకున్నప్పుడు మన తలపుల్లో విహరించాలి. ఆ ఆనందం అనిర్వచనీయం. అది కేవలం మనకే స్వంతం. ఆ క్షణాలు వెలకట్టలేనివి. కష్టాలలో సేద దీరడానికవి సంజీవిని ఔషధం లాంటివి. అందుకే, దయచేసి మన సామ్రాజ్యాన్ని అమ్మేయకండి ప్లీజ్!" అన్నది నీరజ ఎంతో భావోద్వేగంతో.

మదన్ నీరజ ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె పెదవుల్ని మృదువుగా చుంబించాడు.

"ఔను నీరజా! నువ్వన్నది నూటికి నూరు శాతం నిజం. ఈ అనుభూతులు కేవలం మనకే స్వంతం. ఎన్నటికీ మన మనసుల్లోనే మిగిలి పోవాల్సినవి. మనస్సులోనే ఉంచుకుందాం... వెన్నెల సాక్షిగా! ఈ రాసిన కథను కూడా మనమే ఉంచుకుందాం మన బీరువా లాకర్‌లో భద్రంగా. అంతే కదూ"అన్నాడు ఆనందంతో నీరజను ఆలింగనం చేసుకుంటూ.

"థాంక్సండీ. ఈ పోటీ కాకపోతే మరేదైనా వస్తుంది. మీరెంతటి ఉత్తమ రచయిత అన్నది నాకు తెలియదా."

"అలాగా!"

"ఔను. ... అదీ... వెన్నెల సాక్షిగా!" అంటూ నీరజ మదన్ను విడదీయలేనంతగా పెనవేసుకుపోయింది.

★




